సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 25 । మే । 2023



పర్యావరణ పరిరక్షణకు కృషి

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాలని డీఎఫ్‌వో సూర్యనారాయణ అన్నారు. 8లో



నకిలీ చలానాపై నివేదిక 8లో

నకిలీ చలానాపై పూర్తిస్థాయి విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని విజిలెన్స్ డీఎఫ్‌వో రవిశంకర్ శర్మ తెలిపారు.



ఇంటి పంటతో ఆదాయం

ఇంటిపంటలను ఆదాయ వనరుగా మార్చుకుని ఆర్థికాభివృద్ధి సాధిస్తూ గిరి మహిళలు ఆదర్శంగా నిలుస్తున్నారు. 8లో

న్యూస్‌రీల్

అంగన్‌వాడీ పోస్టులకు పారదర్శకంగా ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి,పాడేరు: అంగన్‌వాడీ పోస్టులలకు ఇంటర్వ్యూలు పారదర్శకంగా నిర్వహించామని ఇన్‌చార్జి సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పాడేరు డివిజన్‌లోని అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు చేపట్టారు. అంగన్‌వాడీ వర్కర్ ఒకటి, మినీ అంగన్‌వాడీ వర్కర్లు 2, అంగన్‌వాడీ సహాయకులు ఏడు పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, పలువురు సీడీపీవోలు పాల్గొన్నారు.

రాజేంద్రపాలెం ఆరోగ్య కేంద్రం తనిఖీ



మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెం ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం సాయంత్రం డీఎంహెచ్‌వో జమాల్‌బాషా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అక్కడ ప్రసవానికి వచ్చిన మహిళనుంచి వైద్యసేవల వివరాలు తెలుసుకున్నారు. మందుల నిల్వలను పరిశీలించారు. క్వార్టర్లకు మరమ్మతులు చేపట్టడమే కాకుండా కొత్త భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బంది ఆయనను కోరారు. దీంతో ఆయన పాడైన క్వార్టర్ల భవనాలను పరిశీలించారు. దీనిపై వైద్యాధికారులు లేఖ పంపిస్తే కలెక్టర్, పీవోలకు నివేదిస్తామని డీఎంహెచ్‌వో పేర్కొన్నారు. విధులపట్ల బాధ్యతగా పనిచేయాలని సిబ్బందికి ఆయన సూచించారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన ఆదేశించారు.

నేడు మానసిక రోగులకు వైద్య శిబిరాలు



డాక్టర్ రామారెడ్డి

రాజవొమ్మంగి: మానసిక రోగుల కోసం ఈనెల 25వ తేదీ గురువారం మూడు పీహెచ్‌సీల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు మానసిక వైద్యనిపుణులు డాక్టర్ రామారెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు రాజవొమ్మంగి, 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఎల్లవరం, 2 గంటల నుంచి 4 గంటల వరకు గంగవరం పీహెచ్‌సీలో ఈ శిబిరాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. సమస్య ఉన్న వారు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విశాఖ-అరకు సెక్షన్లో డీఆర్ఎం తనిఖీలు



బొడ్డవర స్టేషన్‌లో పర్యటిస్తున్న డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి, అధికారులు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి బుధవారం ఆయా విభాగాల అధికారులతో కలిసి విశాఖపట్నం-అరకు సెక్షన్‌లో తనిఖీలు నిర్వహించారు. సెక్షన్ పరిధిలోని వివిధ స్టేషన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ముందుగా అరకు రైల్వేస్టేషన్, రెస్ట్ హౌస్, వెయిటింగ్ హాల్స్, డార్మిటరీలు, ఇతర రైల్వే కార్యాలయాను పరిశీలించారు. అనంతరం బొడ్డవర రైల్వేస్టేషన్‌లో పర్యటించారు. అక్కడ జరుగుతున్న రెండో లైన్ పనులను, భద్రతా సంబంధిత ఆధునికీకరణ పనులను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ పర్యటనలో డీఆర్ఎంతో పాటు చీఫ్ ఇంజినీర్ కె.డి.రావు, ఏడీఆర్ఎం(ఇన్‌ఫ్రా) సుధీర్‌కుమార్ గుప్తా, సీనియర్ డివిజనల్ ఇంజినీర్(కో ఆర్డినేషన్) ఎ.కె.మహారాణా, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ జి.సునీల్‌కుమార్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి, సీనియర్ డివిజనల్ సిగ్నల్ అండ్ టెలికం ఇంజినీర్ దీప్తాన్షు శర్మ, సీనియర్ డివిజనల్ ఇంజినీర్(సెంట్రల్) ప్రభాత్‌సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సాగుకు సమాయత్తం

వాతావరణం అనుకూలించడంతోపాటు వర్షాలు సమృద్ధిగా కురువడంతో రైతులు ఖరీఫ్ సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది కూడా 90 శాతం రాయితీపై వరి విత్తనాలను అందుబాటులో ఉంచడంతో రైతులు ఉత్సాహంగా సాగుకు ఉపక్రమించారు. దుక్కి పనుల్లో నిమగ్నమైన రైతులు నారుమడుల తయారీకి సిద్ధపడుతున్నారు.

- అందుబాటులో 18,379 క్వింటాళ్ల వరి విత్తనాలు
- 90 శాతం రాయితీపై పంపిణీ
- జిల్లాలో 60 వేల హెక్టార్లలో సాగు
- ఖరీఫ్ నారుమడుల తయారీకి సిద్ధపడుతున్న గిరి రైతులు



దుక్కి పనుల్లో నిమగ్నమైన గిరి రైతులు



రైతు భరోసా కేంద్రాలకు చేరిన వరి విత్తనాలు

సాక్షి,పాడేరు: జిల్లాలో రైతులంతా ఖరీఫ్ వ్యవసాయానికి సమయత్తమవుతున్నారు.ఈ ఏడాది కూడా ప్రభుత్వం 18,379 క్వింటాళ్ల వరి విత్తనాలను అందుబాటులోకి తెచ్చింది. 90శాతం రాయితీపై గిరి రైతులకు వరివిత్తనాల పంపిణీకి వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలోని వ్యవసాయ భూములకు అనుకూలంగా ఉండే 11 రకాల వరి విత్తనాలు ఇప్పటికే ఆర్‌బీకే కేంద్రాలకు చేరుకున్నాయి. ఖరీఫ్‌లో 60 వేల హెక్టార్లలో వరిని గిరి రైతులు సాగు చేస్తున్నారు.

విత్తనాల వివరాలు.. : ఎస్ఎల్ఆర్ 34449 విత్తనాలు 659.20 క్వింటాళ్లు, ఎంటీయూ 1064 విత్తనాలు 4236.70, ఎంటీయూ 1121 విత్తనాలు 5975.70, ఆర్ఎస్ఆర్ 15048 విత్తనాలు 808 క్వింటాళ్లు, ఎంటీయూ 7029 విత్తనాలు 264, ఎంటీయూ 1318 రకం విత్తనాలు 65.80, ఎంటీయూ 1156 రకం విత్తనాలు 58 క్వింటాళ్లు, ఎంటీయూ 1061 రకం 128 క్వింటాళ్లు, బీపీటీ 3291 రకం 11.50 క్వింటాళ్లు, బీపీటీ 5204 విత్తనాలు 720.35 క్వింటాళ్లు, ఆర్‌జీఎల్ 2537 రకం విత్తనాలు 5451.75 క్వింటాళ్ల చొప్పున మొత్తం 18,379 క్వింటాళ్ల విత్తనాలను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఇప్పటికే 22 మండలాల రైతులకు 90 శాతం రాయితీపై 554 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను సరఫరా చేసింది.

ఆర్‌బీకేల్లో పంపిణీ : ఖరీఫ్ వ్యవసాయ సీజన్‌కు సంబంధించి ఈఏడాది కూడా ప్రభుత్వం ముందుగానే వరి విత్తనాలను అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో వీటిని 90 శాతం రాయితీపై వ్యవసాయశాఖ పంపిణీ ప్రారంభించింది. రాయితీ విత్తనాలపై వ్యవసాయశాఖ సిబ్బంది విస్తృత ప్రచారం చేస్తున్నారు.

దుక్కి పనుల్లో గిరి రైతులు : జిల్లా వ్యాప్తంగా రైతులు ఖరీఫ్ వ్యవసాయ పనుల్లో బిజీగా మారారు. దుక్కిపనులు జోరందుకున్నాయి. వర్షాలు కూడా విస్తారంగా కురుస్తుండడంతో దుక్కి పనులకు అనువుగా ఉంది. వ్యవసాయశాఖ నుంచి పొందిన విత్తనాలతో పాటు, కొంతమంది గిరి రైతులు సంప్రదాయ విత్తనాలతో నారుమడులకు సిద్ధమవుతున్నారు.

రాయితీ విత్తనాలతో మేలు



ఖరీఫ్‌లో అధిక దిగుబడులు లక్ష్యంగా మేలుజాతికి చెందిన వరి విత్తనాలను అందుబాటులోకి తెచ్చాం. 90శాతం రాయితీపై ఈఏడాది కూడా ప్రభుత్వం అమలుచేయడంతో గిరి రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. రాయితీ విత్తనాల పంపిణీని పారదర్శకంగా చేపడుతున్నాం. ఇప్పటికే పచ్చిరొట్ట విత్తనాలను జిల్లా వ్యాప్తంగా 90శాతం రాయితీపై పంపిణీ పూర్తి చేశాం. భూమి సారవంతానికి ఇవి ఎంతో మేలు చేస్తాయి.

– ఎస్‌బీఎస్ నందు, జిల్లా వ్యవసాయాధికారి, పాడేరు

వలంటీర్లే సంక్షేమ సారథులు

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి
- పురస్కారాలతో సత్కారం



వలంటీర్‌ను పురస్కారంతో సత్కరిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



చింతపల్లిలో చౌడుపల్లి వలంటీర్ బిందుకుమారిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

గూడెంకొత్తవీధి: గ్రామ వలంటీర్లు తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి సంబంధించిన సంక్షేమ సారథులని పార్టీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. ఉత్తమ సేవలందిస్తున్న గ్రామవలంటీర్లకు ప్రభుత్వం వరుసగా మూడో విడత అవార్డులను ప్రదానం చేసింది. సేవా రత్న, సేవా వజ్ర, సేవామిత్ర పేరుతో అవార్డులు పొందిన వలంటీర్లను మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సత్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వలంటీర్లు మారుమూల గ్రామాల్లో అందిస్తున్న సేవలను కొనియాడారు. కనీస సదుపాయాలు లేకపోయినా కాలినడకన మారుమూల గ్రామాల్లోకి వెళ్లి కొండలు గుట్టలు ఎక్కి వాగులు దాటి పింఛన్ల పంపిణీతోపాటు అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. దేశంలోనే వలంటీర్ల వ్యవస్థ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. గూడెంకొత్తవీధిలో అవార్డులకు ఎంపికైన 42 మంది వలంటీర్లకు పురస్కారాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఎంపీపీ బోయినకుమారి, జెడ్పీటీసీ నాగరత్నం, వైస్ ఎంపీపీలు ఆనంద్, దేముడు, సర్పంచ్‌లు సుభద్ర, కృష్ణమూర్తి, వీరేంద్రకుమార్, లక్ష్మి, విజయకుమారి, విజయలక్ష్మి, మండల అధ్యక్షుడు పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

చింతపల్లి: వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 22 సచివాలయాల్లో 417 మంది వలంటీర్లు పనిచేస్తుండగా వీరిలో ఇద్దరికి సేవావజ్ర, 5 గురికి సేవారత్న, 218 మందికి సేవామిత్ర పురస్కారాలకు ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అవినీతి రహిత పాలన జగన్‌తోనే మొదలైందని, ప్రతి పథకం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతుందన్నారు. అనంతరం పురస్కారాలకు ఎంపికైన వలంటీర్లను శాలువాలు కప్పి సత్కరించారు. గుర్తింపు పత్రాలు అందజేశారు. ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ బాలయ్య, ఎంపీడీవో సీతయ్య, వైస్ ఎంపీపీలు శారధ, వెంగలయ్య, మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి, ఈవోపీఆర్డీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో జేవీకే కిట్ల పంపిణీ

గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు



సూచనలిస్తున్న గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు

సాక్షి,పాడేరు: జగనన్న విద్యా కానుక కిట్లను సకాలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని స్టాక్ పాయింట్లలో ఉన్న జగనన్న విద్యా కానుక కిట్లను ప్రతీ విద్యార్థికి పంపిణీ చేయడానికి వెల్ఫేర్ అసిస్టెంట్లు బాధ్యతలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం తల్లులు ఖాతాలకు జమ చేసిన జగనన్న విద్యాదీవెన నగదును, ఆయా కళాశాలలకు ఫీజులు చెల్లించాలని ఆయన సూచించారు. విద్యార్థుల బయోమెట్రిక్‌ను వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. ఎస్‌పీసీఐ పోర్టల్‌లో విద్యార్థి, తల్లి ఆధార్ నంబర్లతో అనుసంధానం చేయాలని సూచించారు. డ్రాపౌట్లు లేకుండా విద్యార్థులందరూ పాఠశాలలకు వచ్చే విధంగా తలిదండ్రులు చైతన్యవంతం చేయాలన్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో అందిస్తున్న విద్యా సదుపాయాలు, విద్యా ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని చెప్పారు. పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులంతా పాఠశాలలో ఉండేలా తల్లి దండ్రులు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏటీడబ్ల్యూవోలు ఎల్.రజిని, క్రాంతికుమార్, వెంకటరమణ, మల్లికార్జున, సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మన్యంలో ఈదురుగాలులతో వర్షం



హుకుంపేటలో కురుస్తున్న వర్షం



ఊడపాలెంలో కూలిన భారీ వృక్షం

హుకుంపేట: మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. తీగలవలస, మట్టుజోరు, తడిగిరి, శోభకోట, మఠం, కొట్నాపల్లి,అడ్డుమండ ప్రాంతాల్లో ఉరుములతో కూడిన గాలివానకు ప్రజలుఉ భయాందోళనకు గురయ్యారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

విరిగిపడిన చెట్ల కొమ్మలు

అనంతగిరి: మండలంలోని ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో మండలవాసులు ఇళ్లకే పరిమితమయ్యారు. మధ్యాహ్నం వాతావరణంలో మార్పు చోటుచేసుకుని, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఘాట్‌రోడ్డులోని పలుచోట్ల చెట్టుకొమ్మలు రోడ్డుపై విరిగిపడ్డాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతూ ప్రయాణాలు సాగించారు.

ఈదురు గాలులకు కూలిన భారీ వృక్షం

జి.మాడుగుల: మండలంలో గెమ్మెలి పంచాయతీ ఊడపాలెం గ్రామంలో బుధవారం వీచిన ఈదురగాలులకు భారీ వృక్షం నేలకూలింది. చెట్టు కొమ్మలు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి తగలడంతో వైర్లు తెగిపడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రోడ్డుపై చెట్టు కూలడంతో వాహన రాకపోకలు స్తంభించాయి.

గురుకుల బోధనేతర సిబ్బందికి బదిలీలు

- ఈనెల 30న కౌన్సెలింగ్
- ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి,పాడేరు: పాడేరు ఐటీడీఏ పరిధిలోని గురుకులం విద్యా సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న బోధనేతర సిబ్బందికి బదిలీలు చేపడుతున్నామని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈనెల 23వ తేదీ నుంచి 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు కార్యాలయానికి దరఖాస్తు చేయాలని సూచించారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో విధులు నిర్వహిస్తూ, ఏప్రిల్ 30వ తేది నాటికి రెండు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న బోధనేతర సిబ్బంది బదిలీకి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 30 నాటికి ఐదేళ్లు పూర్తి చేసుకున్న సిబ్బందికి తప్పని సరిగా బదిలీ ఉంటుందన్నారు. ఈ నెల 26వ తేదీన తాత్కాలిక మెరిట్ జాబితాను ప్రచురిస్తామని ఆయన పేర్కొన్నారు. 27వ తేదీన అభ్యంతరాలు స్వీకరిస్తామని, 29వ తేదీన తుది జాబితా ప్రకటిస్తామని పీవో పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీన ఐటీడీఏ సమావేశ మందిరంలో బదిలీలకు కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగుతుందని ఆయన వెల్లడించారు.

వీధి కుక్కలకు సత్వర వైద్యం

- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు
- అప్రమత్తమైన పశుసంవర్థకశాఖ

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని వీధి కుక్కలకు చర్మ వ్యాధులు, ఇతర వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలతో పశుసంవర్ధకశాఖ అప్రమత్తమైంది. పాడేరు పట్టణంలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 100 వీధి కుక్కలను గుర్తించారు. చర్మవ్యాధుల నివారణకు సంబంధించి ఆహారంలో పలురకాల మందులను కలిపి, కుక్కలకు అందించారు. దీనిని కుక్కలు పూర్తిగా తినడంతో పశువైద్యుల ప్రయోగం ఫలించింది. పశుసంవర్ధకశాఖ ఏడీ రవికుమార్,వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు డాక్టర్ చరణ్,డాక్టర్ రాజీవ్,ఇతర పశు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

విద్యాదీవెనలో 13,558 మందికి లబ్ధి



విద్యాదీవెన నమూనా చెక్కును పంపిణీ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

- విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.7,27,66,636లు జమ
- ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలి
- కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న విద్యాదీవెన పథకాన్ని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకుని, ఉన్నత లక్ష్యాలతో చదువుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నుంచి బుధవారం ప్రారంభించిన జగనన్న విద్యాదీవెన కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 13,558 మంది విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన నిధులు రూ.7,27,66,636ను విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆశయం నెరవేర్చేలా ప్రతీ విద్యార్థి ఉన్నతంగా చదువుకోవాలని సూచించారు. విద్యాదీవెన నమూనా చెక్కును అందజేశారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా 11,612 మంది గిరిజన విద్యార్థులకు రూ. 5.78కోట్లు, సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా 16 మంది ఎస్సీ విద్యార్థులకు రూ.1.90 లక్షలు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ద్వారా 1431 మంది బీసీ విద్యార్థులకు రూ.1.04 కోట్లు, 143 మంది ఈబీసీలకు రూ.15.67 లక్షలు, 296 మంది కాపు విద్యార్థులకు రూ.21.77లక్షలు, మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా 11 మంది క్రిస్టియన్ విద్యార్థులకు రూ.1.64లక్షలు, ముస్లిం మైనారిటీలకు చెందిన 49 మంది విద్యార్థులకు రూ.4.66 లక్షల చొప్పున తల్లుల ఖాతాల్లో జమ చేసినట్టు చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, ఎంపీపీ సొనారి రత్నకుమారి, ట్రైకార్ డైరెక్టర్ సమర్ల సరస్వతి, చింతలవీధి సర్పంచ్ వంతాల సీతమ్మ, ఏటీడబ్ల్యూవోలు ఎల్.రజిని, క్రాంతికుమార్, వెంకటరమణ, మల్లికార్జునరావు, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.

మాకవరం క్వారీ మూసి వేయాలని ఆందోళన



మాకవరం క్వారీ వద్ద ఆందోళన చేస్తున్న గిరిజన సంఘం నేతలు, గ్రామాల గిరిజనులు

ముంచంగిపుట్టు: మండలంలోని మాకవరం పంచాయతీ కేంద్రం సమీపంలో ఉన్న నల్లరాయి బినామీ క్వారీని వెంటనే మూసి వేయాలని గిరిజన సంఘంలో ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన నిర్వహించారు. క్వారీ వల్ల సమీప పంట భూములు పాడైపోతున్నాయని, గ్రామాల్లో ఇళ్లు దెబ్బతింటున్నాయని, శబ్ద కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. క్వారీ ప్రమాదాల్లో ఇప్పటివరకు నలుగురు ప్రాణాలు కోల్పోయారని, వారి కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని లేకుంటే ఆందోళన చేస్తామని వైస్ ఎంపీపీ సత్యనారాయణ హెచ్చరించారు. మాకవరం,అరబీరు, కెందుపుట్టు గ్రామాల గిరి రైతులు పాల్గొన్నారు.

విహారానికి వచ్చి.. మృత్యు ఒడిలోకి

- చెట్టు కొమ్మ విరిగిపడి పర్యాటకురాలికి తీవ్ర గాయాలు
- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి



సంధ్య మృతదేహం

మారేడుమిల్లి : ప్రకృతి ఒడిలో సరదాగా సేదా తీరుదామని వచ్చిన ఓ పర్యాటకురాలిని చెట్టుకొమ్మ రూపంలో మృత్యువు కబళించింది. ఆమె బంధువుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు విహార యాత్రకు మారేడుమిల్లి బయలుదేరారు. మార్గంలో రాజమహేంద్రవరంలో మరొక మహిళతో కలిసి ఎనిమిది మంది బుధవారం మారేడుమిల్లి వచ్చారు. ఇక్కడ నుంచి జతలరంగిణి జలపాతం వద్దకు వెళ్లారు. సందర్శన అనంతరం అక్కడి నుంచి అమృతధార జలపాతానికి వెళ్లారు. వీరిలో రాజమహేంద్రవరానికి చెందిన ఎ.సంధ్య (38) జలపాతం పైభాగంలో బండరాళ్లపై కూర్చొని ఉంది. ఆమెపై ఒక్కసారిగా భారీ చెట్టు కొమ్మ విరిగి ఆమెపై పడింది. దీంతో ఆమె కిందకు జారి బండరాళ్లపై పడిపోయింది. తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. బంధువులు వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. ఈ మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి సాగులో భేష్

- కొనియాడిన ఒడిశా అధికారుల బృందం
- రైతుల అనుభవాలను తెలునుకున్న సభ్యులు
- అరకు, డుంబ్రిగుడ మండలాల్లో పర్యటన



ప్రకృతి సాగును పరిశీలిస్తున్న ఒడిశా అధికారులు



ఎరువుల తయారీని పరిశీలిస్తున్న బృందం సభ్యులు

డుంబ్రిగుడ: ప్రకృతి సాగులో మేలైన పద్ధతులు అచరిస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలిచిందని ఒడిశా అధ్యయన బృందం కొనియాడింది. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో అనుసరిస్తున్న సేంద్రియ పద్ధతుల పరిశీలనకు ఒడిశా అధికారులు మూడు బృందాలుగా ఏర్పడ్డారు. రైతు సాధికార సంస్థ ప్రతినిధులతో కలిసి అరకు, డుంబ్రిగుడ మండలాల్లో పర్యటించారు. క్షేత్రస్థాయిలో రైతులు ప్రకృతి సాగులో అనుసరిస్తున్న విధానాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం పద్ధతులను ఆచరిస్తూ, మేలైన దిగుబడులు సాధించి, దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిన ఏపీలోని సాగు విధానాలను పరిశీలించి, తమ రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో అమలు చేసేందుకు ఒడిశా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వారు పేర్కొన్నారు. స్థానిక రైతులు రాగి సాగులో ఆచరిస్తున్న గులి పద్ధతిని పరిశీలించారు. ఈ పద్ధతిని ఆచరించడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులనుంచి తెలుసుకున్నారు. ఈ విధానం వల్ల ఒనగూరే ప్రయోజనాలను రైతు సాధికార సంస్థ ప్రతినిధులు ఒడిశా బృందాలకు వివరించారు. సేంద్రియ ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలించారు. ఒడిశాకు చెందిన ఐడీడీఏ, వ్యవసాయశాఖ అధికారులు బృందంలో సభ్యులుగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రిసోర్స్ పర్సన్ దేముళ్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతులకు రాయితీపై విత్తనాలు



రైతులకు వరివిత్తనాలను పంపిణీ చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

గూడెంకొత్తవీధి: రైతులకు ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా రాయితీపై అందిస్తున్న విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. రింతాడ రైతు భరోసా కేంద్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి గిరి రైతులకు 90శాతం రాయితీపై ప్రభుత్వం పంపిణీ చేసిన మేలు రకం వరి విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మచ్చల మత్స్యరాజు, ఎంపీపీ బోయినకుమారి, జెడ్పీటీసీ శివరత్నం, ఈవోపీఆర్డీ పాపారావు, ఏవో మధుసూధనరావు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖలో బదిలీలు

మహారాణిపేట : వైద్య ఆరోగ్యశాఖలో సిబ్బందికి మ్యూచువల్(పరస్పర) బదిలీలు బుధవారం నిర్వహించారు. డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలో ఉన్న రీజనల్ డైరెక్టర్ (ఆర్‌డీ) డాక్టర్ ఎస్.ఉమాసుందరి ఆధ్వర్యంలో ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు, హెడ్ నర్సులు, ఎంఎల్‌హెచ్‌పీలకు బదిలీ ప్రక్రియ చేపట్టారు. ఇందులో 140 మందికి పరస్పర బదిలీలు జరిగాయి.

బాక్సింగ్‌లో స్వర్ణ పతకాలు

నర్సీపట్నం: రాష్ట్ర స్థాయి బాక్సింగ్ టోర్నమెంట్‌లో నర్సీపట్నానికి చెందిన మహిళా బాక్సింగ్ క్రీడాకారులు రెండు స్వర్ణ పతకాలు సాధించారు. విశాఖ రైల్వే గ్రౌండ్‌లో ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు ఏపీ బాక్సింగ్ అసోసియేషన్ వారు నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో సీనియర్ ఉమెన్ బాక్సర్లు యర్రా తేజస్విని (75 కిలోల విభాగం), బొంతు మౌనిక (80 కిలోల విభాగం) సత్తా చాటారు. వీరు ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు, సెక్రెటరీ లక్ష్మణదేవ చేతుల మీదుగా స్వర్ణ పతకాలు అందుకున్నారు. వీరిని శాప్ కోచ్ అబ్బు, నింజాస్ అకాడమీ డైరెక్టర్లు వెలగా నారాయణ, పారుపల్లి శ్రీనివాసరావు, సుతాపల్లి శ్రీకాంత్, సుతాపల్లి శ్రావణ్ అభినందించారు.

ఇంటి పంటతో ఆదాయం



చింతూరు ప్రధాన కూడలిలో కూరగాయలు, ఆకుకూరలను విక్రయిస్తున్న గిరిజన మహిళలు

చింతూరు: ఇంటిపంటలను తమ ఆదాయ వనరుగా మార్చుకున్నారు గిరిజన మహిళలు. తమ ఇంటి పెరట్లో కూరగాయలు, ఆకుకూరలు పండించి వాటిని విక్రయించడం ద్వారా ఆర్థికాదాయాన్ని సమకూర్చుకుంటున్నారు. ఏజెన్సీలోని చింతూరు, కూనవరం, వీఆర్ పురం, ఎటపాక మండలాల్లో గిరిజన మహిళలు ఇంటి పంటలుగా కూరగాయలు, ఆకుకూరలు ఏడాది పొడవునా పండిస్తున్నారు. సేంద్రీయ ఎరువులు, కషాయాలు వినియోగించి పండిస్తున్న వీటికి మార్కెట్లో మంచి గిరాకీ ఏర్పడింది. దీంతో చాలా మంది మహిళలు ఇంటి పంటలపై ఆశక్తి చూపుతున్నారు. ఒక్కో కుటుంబం ఏడాదికి రూ లక్ష వరకు ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు.

సాగు ఇలా : ఇంటి పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని చదును చేసి దుక్కిదున్ని కూరగాయల సాగుకు అనుకూలంగా మలుస్తున్నారు. వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరల విత్తనాలను కొనుగోలు చేసి వాటిని చల్లుతున్నారు. ఇళ్లలోని మోటార్లు, చేతిబోర్ల సాయంతో తడులు పెడుతూ నీటిఎద్దడి లేకుండా చూస్తున్నారు. కషాయాలను వినియోగిస్తున్నారు. ఇంటిల్లిపాదీ కలసి సేద్యం చేస్తూ కూరగాయలు, ఆకుకూరలు మంచిగా పండేలా కష్టపడుతున్నారు. పంటను పశువులు పాడు చేయకుండా చుట్టూ కంచె నిర్మిస్తున్నారు. ప్రధానంగా కూరగాయల్లో ఆనప, వంకాయ, బెండ, బీరకాయ, చిక్కుడు, గోరుచిక్కుడు, టమాటా, కాకర, బరబోటి వంటివి పండిస్తున్నారు. ఆకుకూరల్లో తోటకూర, గోంగూర, పాలకూర, చుక్కకూర, కొత్తిమీర, మెంతికూర, పుదీనా వంటి వాటిని పండిస్తున్నారు.

మండల కేంద్రాల్లో విక్రయాలు

గిరిజన మహిళలు తాము పండించిన కూరగాయలు, ఆకుకూరలను మండల కేంద్రాలకు తీసుకొచ్చి ప్రధాన కూడళ్లలో విక్రయిస్తున్నారు. కూరగాయలను పోగులుగా, ఆకుకూరలను కట్టలుగా కట్టి పోగు రూ.20కి, కట్ట రూ.5 లేదా రూ.10లకు విక్రయిస్తున్నారు. ఉదయమే తాజా కూరగాయలు సరసమైన ధరలకు లభ్యమవుతుండడంతో వినియోగదారులు అధికశాతం వాటినే కొనుగోలు చేస్తున్నారు. ప్రధాన సెంటర్లో బస్సులు నిలిపే ప్రదేశాల్లో విక్రయిస్తున్నారు. సేంద్రియ ఎరువులతో పండిస్తుండడంతో కూరగాయలు, ఆకుకూరలు ఎంతో తాజాగా వండిన పిదప రుచికరంగా ఉంటున్నాయని కొనుగోలుదారులు అంటున్నారు.

ఆదాయం బాగుంది



ఇంటి పక్కనే ఉన్న అర ఎకరం ఖాళీస్థలంలో కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నాం. నీటిఎద్దడి లేకుండా చూడడంతో పంటలు బాగానే పండుతున్నాయి. దీని వలన మా కుటుంబానికి ఏడాది పొడవునా ఆదాయం వస్తోంది. – పాయం రాధాబాయి, చూటూరు, చింతూరు మండలం

కుటుంబ పోషణకు ఉపయోగం



కూరగాయలు, ఆకుకూరల ద్వారా వస్తున్న ఆదాయం కుటుంబ పోషణకు ఎంతో ఉపయోగపడుతోంది. కూరగాయలు, ఆకుకూరలు తాజాగా ఉండడంతో అనేక మంది వీటినే ఇష్టపడుతున్నారు. – కొర్సా జయమ్మ, కుమ్మూరు, చింతూరు మండలం

నకిలీ చలానాపై నివేదిక

విజిలెన్స్ డీఎఫ్‌వో రవిశంకర్ శర్మ

గొలుగొండ: నకిలీ చలానా వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని విజిలెన్స్ డీఎఫ్‌వో రవిశంకర్ శర్మ తెలిపారు. స్థానిక కలప డిపోవద్ద ఆయన బుధవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇటీవల కలప చలానాలో చోటుచేసుకున్న అవకతవకలపై సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. రంపచోడవరం నుంచి వ్యాన్‌లో తరలించిన కలపకు రూ.8వేల చలానా కట్టవలసి ఉండగా కేవలం రూ.700 మాత్రమే చెల్లించినట్టు గుర్తించామని చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా రౌతులపూడి వద్ద అటవీశాఖ అధికారులు వ్యాన్‌ను తనిఖీ చేయడంతో ఈ విషయం బయటపడటంతో వారు వాహనాన్ని సీజ్ చేశారన్నారు. అల్లూరిసీతారామరాజు జిల్లా పరిధిలో ఉన్న కాకరపాడు, అనకాపల్లి జిల్లా పరిధిలో ఉన్న ఎర్రవరం చెక్‌పోస్టుల వద్ద చలానాలు తనిఖీలు చేయకుండా వ్యాన్‌ను వదలడంపై సిబ్బందిని విచారించారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఈ తప్పిదం జరిగిందని, పూర్తిస్థాయిలో విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. కలప అక్రమ రవాణా అరికట్టే చర్యల్లో భాగంగా చెక్‌పోస్టుల వద్ద నిఘా మరింత పెంచామని ఆయన పేర్కొన్నారు. నర్సీపట్నం డీఎఫ్‌వో రాజారావు, డివిజన్ పరిధిలోని అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



చింతపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

చింతపల్లిరూరల్: పర్యావరణ పరిరక్షణకు అందరు కృషి చేయాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాలని డీఎఫ్‌ఓ సూర్యనారాయణ అన్నారు. స్థానిక అటవీశాఖ కార్యాలయం వద్ద మిషన్ లైఫ్ ఎన్విరాన్‌మెంట్ (పర్యావరణహిత)కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవజాతులు కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి తీరని నష్టం జరుగుతుందని, దానిని నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిలో ఉందన్నారు. ప్రతి ఒక్కరు పర్యావరణ రహితంగా జీవనశైలిని అలవర్చుకోవాలన్నారు. అనంతరం అటవీశాఖ సిబ్బందితో జీవరాశులను కాపాడుకుంటామంటు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రేంజ్ అధికారి ఎల్.వి.కె.పాత్రుడు, డీఆర్‌వో వెంకటరాజు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జి.మాడుగుల: కాలుష్య నివారణతోపాటు, ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దటానికి గిరిజన ప్రజలు దృష్టి సారించాలని సీ198 సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ ఓసీ ఉదయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలో సుర్మతి ఏవోపీ అధ్వర్యంలో బుధవారం మిషన్ లైఫ్ ప్రోగ్రామ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా వ్యర్థాల నిరోధం, ఆరోగ్యకరమైన జీవనశైలి తదితర అంశాలపై గత వారం రోజుల నుంచి గ్రామాల్లోని గిరిజనులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మూడో ప్రయత్నంతో మెరిసెన్

సివిల్స్‌లో 315వ ర్యాంక్ సాధించిన ఆశ్రిత



తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర) : మొదటి రెండు ప్రయత్నాలు విఫలమయ్యాయి. అయినా ప్రయత్నం ఆపలేదు. ఆత్మవిశ్వాసం సడలలేదు. అదే విశ్వాసంతో, సాధించాలనే పట్టుదలతో మూడో ప్రయత్నం కొనసాగించి, సివిల్స్‌లో 315 ర్యాంకు సాధించింది. ఆమె మరెవరో కాదు. నగరానికి చెందిన నౌపడ ఆశ్రిత. విశాఖపట్నంలో సాధారణ మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన ఆశ్రిత ప్రాథమిక విద్యాభ్యాసం నగరంలోని రైల్వేన్యూకాలనీలో ఉన్న హరగోపాల్ స్కూల్లో జరిగింది. అనంతరం నారాయణ కళాశాలలో ఇంటర్ బైపీసీ చదివింది. తరువాత ఆదిత్య డిగ్రీ కాలేజీ నుండి డిగ్రీ పూర్తి చేసింది. 2019లో ప్రైవేట్ ఉద్యోగంలో చేరింది. అక్కడి నుంచి సివిల్స్ ర్యాంక్ సాధన వరకు తన ప్రయాణాన్ని సాక్షికి ఆశ్రిత తెలిపింది. ఆమె మాటల్లోనే.. ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నప్పుడే సోషల్ వర్క్ పట్ల ఆసక్తి పెరిగింది. సివిల్స్ కోచింగ్ కోసం ఢిల్లీకి వెళ్లా. కోవిడ్ కారణంగా కోచింగ్ మధ్యలోనే ఆగిపోయింది. తిరిగి ఇంటికి చేరుకున్నా. ఇంటి దగ్గరే చదివి, రెండు సార్లు సివిల్స్ రాశాను. కానీ ప్రిలిమ్స్ కూడా అర్హత సాధించలేకపోయా. ఈసారి పట్టుదల పెరిగింది. మరోసారి రాసేందుకు కోచింగ్ తీసుకున్నా. 2022లో సివిల్స్ మూడో అటెంప్ట్ చేశా. తాజాగా విడుదలైన ఫలితాల్లో 315వ ర్యాంకు వచ్చింది. ఈ ర్యాంకుకు జనరల్ కేటగిరీలో ఐఏఎస్‌కు ఎంపిక కానని తెలుసు. అందుకే మరోసారి ర్యాంకు మెరుగుగైన ర్యాంకు కోసం 28న జరిగే ప్రిలిమ్స్‌కు హాజరుకానున్నట్టు ఆశ్రిత పేర్కొంది. తండ్రి ప్రైవేట్ ఉద్యోగి, తల్లి గృహిణి. తల్లితండ్రుల ప్రోత్సాహం, పక్కా ప్రణాళిక, అధ్యాపకులు శిక్షణ తనసీ స్థాయికి తీసుకొచ్చాయని తెలిపింది.

ప్రభుత్వ నేత్ర వైద్యశాలలో సాయంత్రం ఓపీ సేవలు



సీతంపేట(విశాఖ): రామటాకీస్ రోడ్‌లో గల ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో ఈవెనింగ్ ఔట్ పేషెంట్ (ఓపీ) సేవలు అందిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.విశ్వామిత్ర తెలిపారు. రోజూ మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పేషెంట్లను పదే పదే తిప్పకుండా పూర్తి సేవలు అందించేలా అవసరమైన వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ఆ రోజు ఏ యూనిట్ వైద్యులు ఉంటారో అదే యూనిట్ వైద్యులు సాయంత్రం ఓపీ సేవలు అందిస్తారన్నారు.

కారు-ఆటో ఢీ- ఆరుగురికి తీవ్రగాయాలు



సంఘటన స్థలంలో క్షతగాత్రులు



తీవ్రంగా గాయపడిన కూండ్రపు అప్పలనాయుడు

నర్సీపట్నం: నర్సీపట్నం-తుని రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. టౌన్ ఎస్ఐ గోవిందరావు తెలిపిన వివరాలు..నర్సీపట్నం మున్సిపాలిటీ బయపురెడ్డిపాలెం చెరువు మలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న కారు, ఆటో ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఆటో నుజ్జు అయింది. ఆటోలో ప్రయాణిస్తున్న నర్సీపట్నం మండలం మెట్టపాలెంకు చెందిన కూండ్రపు అప్పలనాయుడు, నాతవరం మండలం బెన్నవరం కన్నంరెడ్డి లక్ష్మి , రోలుగుంట మండలం రాజన్నపేటకు చెందిన మొల్ల కృష్ణవేణి, వడ్డిపకు చెందిన ఆటో డ్రైవర్ ఎం.నానాజీ గాయపడ్డారు. కారులో ప్రయాణిస్తున్న కోటనందూరు మండటం, గంగవరానికి చెందిన చెంచుబాబు, గెడ్డం పార్వతి గాయాలకు గురయ్యారు. కారు డ్రైవర్ అశోక్‌కు ఏమి కాలేదు. క్షతగాత్రులను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర వైద్య సేవలు అందించి తీవ్రంగా గాయపడిన అప్పలనాయుడు, లక్ష్మిని విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. మితిమీరిన వేగంతో కారును నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

ఏపీ 'మా' అధ్యక్షుడిగా దాడి



మాట్లాడుతున్న దాడి సత్యనారాయణ

సీతమ్మధార(విశాఖ ఉత్తర) : ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా నగరానికి చెందిన దాడి సత్యనారాయణ ఎన్నికయ్యారు. స్థానిక బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని సింధూర గెస్ట్‌హౌస్‌లో సంఘ సర్వసభ సమావేశం బుధవారం నిర్వహించారు. నూతన కమిటీ ఎన్నికలు జరిపారు. కార్యదర్శిగా వర్రె నాంచారయ్య, కోశాధికారిగా పాండాతో పాటు సభ్యుల్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దాడి సత్యనారాయణ మాట్లాడుతూ కళాకారుల్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కళాకారుల సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, తేజ, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోడ కూలి వ్యక్తి మృతి

అచ్యుతాపురం(అనకాపల్లి): మండల కేంద్రంలో బుధవారం సామిల్లు వద్ద గోడ కూలడంతో ఓ వృద్ధుడు మృతి చెందాడు.అచ్యుతాపురానికి చెందిన ఎం.గోవింద్(57) ఈ ప్రమాదంలో మరణించాడు. ఈయనకు ఇద్దరు పిల్లలున్నారు. మృతునికి కుటుంబానికి న్యాయం చేయాలని స్థానికులు ఆందోళన చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రిలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సాగర్‌కుమార్

నర్సీపట్నం: పురుగు మందుతాగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం ఏరియా ఆస్పత్రిలో చోటు చేసుకుంది. ఆస్పత్రి సిబ్బంది అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. రావికమతం మండలం గంటికొర్లాం గ్రామానికి చెందిన సింగ్ సాగర్ కుమార్(40) పురుగు ముందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయన భార్య కుమారి ఆశ కార్యకర్తగా పనిచేస్తోంది. విధి నిర్వహణలో భాగంగా కుమారి గ్రామంలో గర్భిణిని ప్రసవం కోసం ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చింది. భార్య వెంట సాగర్‌కుమార్ ఆస్పత్రికి వచ్చాడు. ప్రసూతి వార్డు వద్ద భార్యాభర్తలు గొడవ పడ్డారు. భార్య ముందే తన వెంట తెచ్చుకున్న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారకస్థితిలోకి చేరుకున్న సాగర్‌కుమార్‌కు వెంటనే అత్యవసర వైద్య సేవలు అందించడంతో తేరుకున్నాడు. టౌన్ ఎస్ఐ గోవిందరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.